# చేపల చెరువు

ఈసారి చెర్లోనీళ్ళుఏమాత్రంతగ్గలేదు. పొలాల్లోవరి కంకులుపాలు పోసుకుంటున్నాయి. చేపలు మాత్రం బాగా బలిశాయి. వాటి కోసం చేపల కాంట్రాక్టర్స్ కాచుకుని వున్నారు. పంచాయితీ వాళ్లు తమ చూపును కాపలాగ వుంచారు. రైతులు వరి కంకులను చూస్తూ మురిసి పోతున్నారు. అంతేకాదు చెర్లో వున్న నీటితో కత్తెరపంటకు లోటుండదు. అయితే నీరు వొదలొద్దు. చెరువు కట్టమీది నుండి ఊళ్లోకి పోతూవుంటే మొట్టమొదట ఓ ఓపెన్ గ్రౌండులో వివిధ రాజకీయ పార్టీల జెండాల దిమ్మెలు. వాటిపై ఆయా పార్టీల గుర్తులు. ఆ గుర్తు కింద జనం గుంపులుగ విడిపోయి ఉన్నారు. ఏ పండుగకు ఆ దేవున్ని కొలిచినట్టుగ ఏ పార్టీ మీటింగ్‌కు ఆపార్టీవాళ్లు గుమికూడి మీటింగ్ జరుపుకుంటారు. పండగనాడు తాగినట్టే ఆ మీటింగ్ నాడు కూడ తాగి తందానలాడుతారు. అందువల్ల ఉన్నా లేకున్నా పండగలన్నా, పార్టీ మీటింగులన్నా ఆవూరి జనానికి ఎంతో యిష్టం. ఆ ఖాళీ స్థలాన్ని దాటి కొంచెం ముందుకు పోతే కులాల వారీగా వాడలు కనిపిస్తాయి. గొల్ల - కురుమ ఇండ్ల పందిళ్లకింద ఆ రోజే పుట్టిన గొర్రె పిల్లలు, మేక పిల్లలు కనిపిస్తాయి. మరొక వాడలో కాపుతనపు రైతుల ఇళ్లు. వాళ్ల వాకిళ్లలో రెండు గుమ్మలు, పక్కమ్మటే ఉండే పాకల్లో గేదెలు, వాటి దూడలు కనిపిస్తాయి. నడి ఊళ్లో వడ్ల కమ్మరివాళ్ల ఇళ్లు, వాళ్లు పనిచేసే కొలుములు, దాటీలు కనిపిస్తాయి. ఆ తరువాత గౌండ్ల వాళ్ల ఇండ్లు వాటి సాయమాన్న మొగురాలకు మట్టి లొట్లు కనిపిస్తాయి. ఆ తరువాత ఓ పక్కన చాకలి, మంగలి ఇళ్లు మరోపక్క కుమ్మరి ఇళ్లు, వాళ్ల పందిళ్ల ఎదురుగ కుండలు కాల్చే వాములు వున్నాయి. ఊరి చివర ఒకవైపు మాలల ఇండ్లు, మరొకవైపు మాదిగల ఇండ్లు ఉన్నాయి. ఆ తరువాత దొడ్లు, గడ్డి కొడార్లు వున్నాయి. ఆ ఊరి చెరువు నీరు తూర్పువైపు పారిస్తుంది.

* * *

ఆ ఊరి రైతులందరు యం. ఆర్. ఓ. కార్యాలయం ముందు గుమికూడారు. అందరు సంతకాలు చేసిన అర్జీ ఓ యువరైతు చేతిలో వుంది. యం. ఆర్. ఓ.ది యం. ఆర్. ఓ. పిలుపు రాగానే ఆయన గదిలోకి వెళ్ళి అర్జీ పత్రాన్ని అందజేస్తూ -

"మాకు న్యాయం చేకూర్చవల్సిందిగ మనవి " అన్నాడు.

అర్జీని అందుకున్న యం. ఆర్. ఓ. దానిని పూర్తిగా చదివి,

"ఆర్. ఐ. ని పంపిస్తాను వెళ్లండి" అన్నాడు.

"మేము చెరువు దగ్గర వుంటాం సార్" అన్నారు.

"సరే" అంటూ బెల్ నొక్కాడు. యం. ఆర్. ఓ. కు చేతులు జోడించి అందరు

బయటికి నడిచారు. అందరు ఊరు చేరి చెరువుకట్ట మొదట వున్న వేపచెట్ల కింద కూర్చొని ఆర్.ఐ. రాక కోసం ఎదురుచూస్తువున్నారు. అనుకున్నట్లే ఆర్.ఐ. గారి మోటారు సైకిల్ వొచ్చి ఆగింది. దాని చప్పుడుకు పక్కన వంపులో మేస్తున్న గొర్రెలు ఒక్కచోటికి చేరాయి.

బ్యాగ్ లోనుండి తన డైరీ తీసి, దానిలోవున్న ఇంతకుముందు వాళ్లు ఇచ్చిన అర్జీని తీసి పైభాగాన్ని కళ్లతోనే మౌనంగ చదివి,చివరి ప్యారాను అందరు వినేటట్టుగ చదివాడు.

'చెరువులోని నీళ్లను వదిలితే చేపలు పట్టడానికి వీలుంటుందని గ్రామ పంచాయితికి దరఖాస్తు పెట్టారు. వదలడానికి ఒప్పందం కుదిరింది. రేపో మాపో నీరు వదలనున్నారు. అట్లా వదిలితె కత్తెర పంటకు నీరు చాలదు. అందువల్ల రైతుకెంతో నష్టం జరుగకలదు. అందువల్ల కత్తెర తరువాత వదిలితే బాగుంటుందని, వదలకుండా వుంచవల్సిందిగ మనవి. ఎన్నో ఏండ్ల తరువాత గాని చెరువు ఇంతగా నిండింది. వాటిని వృధాగా వదుల వద్దని ప్రార్థిస్తున్నాం.'

తుమ్మలగూడెం,

రైతులు.

ఆర్. ఐ. దరఖాస్తు చదివి అక్కడ కూడిన రైతుల వైపు చూశాడు. కట్ట మీద నడుస్తూ, చెరువులోని నీళ్లను, దానికింది ఆయకట్టును చూశాడు. చెర్లోని చేపలను చూస్తూ నిలుచున్నాడు. తాను ఊళ్లో లేని కారణంగా అప్పుడే వచ్చిన గ్రామాధికారి ఆర్. ఐ. కి నమస్కరించి, రైతులను ఆగమని సైగచేసి, ఇద్దరు చెరువు అలుగువరకు నడిచి అక్కడ ఆగారు.

"ఏమంటారు వీళ్లు" అని అడిగారు.

"ఏముంది కత్తెర పంటకు సరిపోయే నీరుంది. చేపలు పట్టడం కోసం నీటిని వదులొద్దు అంటున్నారు."

"నీవేమన్నావు" అని కాస్త లావుగా వున్న గ్రామాధికారి బ్యాగ్ ను చూస్తు అడిగాడు.

"వీలుకాదు, చేపల కాంట్రాక్టర్ గట్టి వాడు వీని సంగతి మీకు తెలుసుకదా" అన్నాను.

గ్రామాధికారి సంకలో ఆ బ్యాగ్ తూకానికొచ్చిన తెల్లచేపలాగుంది.

"అంటే ఏమన్నారు."

"అందుకే ఉన్నంతలో మేమూ". అని చేతి వేళ్లను చూపించి, "ఇచ్చారు గూడ" అన్నాడు ముసి ముసిగ నవ్వుతూ.

"అట్టనా" అన్నట్టు చూశాడు ఆర్. ఐ. విప్పారిన ముఖంతో, తెల్లచేపమీద చూపు ఆపి.

'మరి లేకపోతే' అన్నట్లు కనురెప్పలను ఓసారి వాల్చి చూశాడు. ఇద్దరు అలుగులోనుండి కట్టమీదికెక్కి, ఊరివైపు నడిచారు. మధ్యలో నిలుచున్న రైతులవైపు మళ్ళి ఆర్. ఐ. 'నేను

చూసుకుంటా' అన్నట్లు భరోసాగా రైతులవైపు చూశాడు.

ఆ సైగను గ్రహించిన రైతుల ముఖాలలో వెలుతురు పూసింది.

*   *   *

ఊళ్లోకి ఓ జీప్ వచ్చింది. వస్తూ వస్తూ బజార్లోని దుమ్మునంతా లేపుతూ వచ్చింది. అది సందులు గొందులు దాటి చెరువు కట్టకొమ్మున అగింది. కొంచం పక్కకు కట్టమ్మెటె ఓ కానుగు చెట్టు. దానికింద మైసమ్మగుడి. మూడువైపుల మూడు బండలు వాటిపైకప్పుగ మరో బండ. ఆ బండలకంత పసుపు, కుంకుమ బొట్లు నూనె మరకలు. దానిలోపల ఓ నల్లరాయి. దానికీ పసుపు కుంకుమ బొట్లు. దాని ఎదురుగ ఓ కొత్త కుండ, దాని మీద ఓ కంచుడు. ఆ కంచుట్లో పత్తిని ఒత్తి చేసి, నూనెపోసి వెలిగిస్తుంటారు. ఇంకా ఆ గూట్లో ఎన్నో దీపంతలు. గుడిముందు, కానుగు చెట్టుకు వేలాడ దీసిన వుట్టి. ఆ వుట్టిలోను మరో చిన్న మట్టి పటువ, దానిమీద మరో కంచుడు. అలాగే చుట్టు వేలాడదీసిన గొర్రెల, మేకల తెగకోసిన కాళ్లు. ఆగిన జీపులో నుండి దిగిన ఓ లావుపాటి మీసాల వ్యక్తి గుడివైపు నడిచాడు. ఆయన దిగి నపుడు జీపు అటు ఇటు ఊగింది. జీపులో వున్న మిగతా ఇద్దరు ఆయన్ను అనుసరించారు. మీసాల వ్యక్తి మైసమ్మ దగ్గరికి వెళ్లి అక్కడవున్న కుంకుమను తీసుకుని నుదుట అర్ధరూపాయంత బొట్టు పెట్టుకున్నాడు. అనుచరులు అలాగే చేశారు. ఒకడు అగరొత్తులను అంటించాడు. మరొకడు తన దగ్గరున్న సార సీసాను అందించాడు. మీసాల వ్యక్తి కొంత సారాను ఆరపోసాడు. మరొక వ్యక్తి అందించిన కొబ్బరికాయను పట్టుకుని మైసమ్మకు దండం పెట్టి కొట్టి, ఇప్పటికి దీంతో సరిపెట్టుకో అన్నట్టు చూశాడు. ఆ తరువాత కొబ్బరి చిప్పలను అనుచరులు అందుకోగా, అక్కడి నుండి కదిలి కట్టెక్కారు. అప్పటి వరకు కట్టెక్కి పడుకున్న తాబేలు తన లాంటి వాడె వస్తున్నాడని నీటిలోకి జారుకుంది. మీసాల ఆసామి చెరువు నీటిని పార చూశాడు. నీటిలోని చేపల మీద దృష్టి నిలిపాడు. సగం నీరు తగ్గడం వల్ల ఆ నీటిలో అన్నీ వందరూపాయల నోట్లు కదులుతున్నట్లు అనిపించాయి. అప్పుడాయన కళ్లలో మధ్యాహ్నపు ఎండ నీటిలో బంగారం కనిపించింది. కాసేపు కళ్లు మూసుకున్నాడు. చేతులు జోడించి చెరువుకు దండం పెట్టాడు. సరిగ్గా ఓ చేపిల్ల నీటినుండి పైకి ఎగిరి మళ్లి నీటిలో పడింది. అప్పుడది నీల వజ్రంలాగ చమక్కుమంది. మీసాల కింద చిరునవ్వు కదిలింది. కట్టమీద నిలుచున్న అతని రూపం, పట్టులాల్చి, తెల్లని పూనా పాంటులో, మెడకు పులిగోళ్ల బంగారు గొలుసు, ఎడమ, కుడి చేతి వేళ్లకు మూడేసి ఉంగరాలతో, భుజంమీద ఎర్రని కండువాతో ఆయన పక్కనే తవ అనుచరుల ప్రతిబింబాలు చెరువులో కనిపించాయి. కాని అవి ఉన్నంత కాకుండా పొట్టిగా కనిపిస్తున్నాయి. వాళ్ల ప్రతిరూపాలు కన్పించినంత లెక్కన చేపలు కదలడం లేదు. అవి బెదిరి పక్కలకు పారిపోతూ ఉన్నాయి. బహుశా వీళ్ల రహస్యం తెలుసుకున్నట్టున్నాయి.

"సగం కంటె ఎక్కువ నీటిని వదిలితే గాని పట్టొచ్చు" అన్నాడు మీసాల వ్యక్తి.

ఆయన ఓ పెద్ద చేపల కాంట్రాక్టర్. అన్ని చెరువుల్లో చేపలను పట్టి కలకత్తాకు లారీల కొద్ది పంపిస్తూ వుంటాడు. కట్టలకు కట్టలు నోట్లు తెచ్చుకుంటు వుంటాడు. కలకత్తాలో కమ్యూనిస్ట్ పార్టీ, ఆంధ్రలో రూలింగ్ పార్టీ అండ.ఆయనకుంది.

పంట విలువ తెలియని పదిమంది రైతులు ఇట్లా తలోమాట అంటువున్న వీలులేదు, నీరు వదిలితే కత్తెర పంట వేయలేమని పట్టు పట్టారు.

నీటిపారుదల శాఖ చుట్టూ, యం. ఆర్ ఓ చుట్టు తిరుగుతూనే వున్నారు.

చేపలను ఇంకా చెర్లో వుంచితే సగానికి సగం తరుగువస్తాయని కాంట్రాక్టర్ గోల.

ఊళ్లో వున్న యస్.టి.డి నుండి తన యజమానికి ఫోను చేసి పరిస్థితిని తెలియ చేస్తున్నాడు కాంట్రాక్టర్ గుమాస్తా.

"అది సంగతి. ఊరి రైతులంతా వీలు కాదు అంటున్నారు"

"హల్లో ఏంటి నీవు మాట్లాడేది? వాళ్లకు దడిస్తే మనం వ్యాపారం చేసినట్టే, నేను హైద్రాబాదు ఫోన్ చేసి ఫలాన వాళ్లను రప్పిస్తాను, మక్కెలిరుగ తంతారు. అప్పుడు వాళ్ల గుణం కుదురుతుంది. డబ్బులకు ఆశపడని, దెబ్బలకు భయపడని మనిషివుండ్రా బాబు. అవన్నీ నే చూసుకుంటగ"

"అలాగే" అంటూ ఫోను పెట్టేసి, బిల్ కట్టేశాడు. గుమస్తా అక్కడి నుండి కదులుతూ "ఈ చెరువు పరిస్థితి ఇలావుంటే మిగతా చెరువుల సంగతి?" చెరువు వైపు నడిచి కట్టెక్కి నిలుచున్నాడు.

చెర్లో చేపలు బిలబిలమంటు నీటి ఉపరితలానికి చేరి సూర్యుని వైపు చూస్తున్నాయి. వాటిని చూసిన గుమస్తా ఈసారి పైసలె పైసలు అనుకుంటూకట్టకిందికి చూశాడు. వరి చేను చాలా వత్తుగా పెరిగి, పణలు పణలుగ పాలు పోసుకుని గింజలు పసుపు రంగులోకి మారుతున్న దశ. మరో పదిరోజుల్లో తెరిపి లేకుండా నీరు అందితే గాని చేతికి రావు. అప్పుడు కాని పశువులకు గడ్డి, మనుషులకు తిండిరాదు. ఈపరిస్థితి ఎట్లా గట్టెక్కుతుందో అనుకున్నాడు.

చెరువు కట్టచివరన ఓ నులక మంచం, దానిమీద పొడగాటి టార్చ్‌లైటు వుంది. ఆ మంచం చెరువు కాపలాదారునిది. ఆ పక్కనే వున్న బండమీద పొడగాటి తెల్ల చేపలు పొట్టలు చీల్చి, శుభ్రంచేసి, ఎండబెట్టి వున్నాయి. వాటిమీద రేగుకంప. గుమాస్తా మంచం మీద కూర్చొని, తన జేబులోనుండి నోటు బుక్ తీసి, ఊళ్లోని ముఖ్యుల పేర్లను వరుసగా రాసుకున్నాడు. మరొక పేజీలో మరికొన్ని పేర్లు రాసుకున్నాడు. తనకు తెలియని పేర్లు కొన్నిటిని అక్కడి కాపలా అతన్ని అడిగి తెలుసుకున్నాడు. నోటుబుక్కును జేబులో

పెట్టుకుంటూ ఓసారి ఆవులించాడు. ఆవులించినపుడు కళ్లలో తిరిగిన నీరు మెరిసింది.

తాను మొట్ట మొదట ఈ ఊరొచ్చిన రోజులు గుర్తొచ్చాయి. అందరికి ఎంతో దగ్గరగా మెలుగుతూ వుండేది. ఒకరోజు ఒకావిడ పట్టపగలు బట్టలుతుక్కోవడానికి చెరువు దగ్గరికి వచ్చింది. ప్రౌఢవయస్సులో వున్న ఆమె ఓ మాదిరిగ చూసి నవ్వింది. విరగకాసిన మామిడి కొమ్మలాగ వంగి సుతారంగ ఎడమ చేతితో చూపులకు అడ్డం వస్తున్న కురులను చెవి మధ్యన చెక్కుకుంటూ వుంది. అపుడు ఆకులు పక్కకు జరిగినయి. చూపు అక్కడే ఆగింది. 'ఇది ఊరు గాని వూర 'ని మనస్సు హెచ్చరించింది. వెంటనేతాను ఏది పట్టనట్లు ముఖాన్ని బిగపట్టుకుని నిలుచున్నాడు. ఆతరువాత మరొక రోజు కట్టమీద ఎదురైంది ఆమె. అప్పుడు ఆమె కొంగు నడుంకు చుట్టుకుని చంకలో బట్టల మూటతో వుంది. అతనిలో కాస్త తడబాటు చోటు చేసుకుంది. ఆమె అదోలాగ చూసింది. అంతే చెరువులో రాయి విసిరితే చెరువు నీరంతా కదిలి నట్టుగా అతని వంట్లోను ఏవేవో ఆకర్షణ తరంగాల అలజడి. ఆమె చేతులను చూసి అతడు అవాక్కయ్యాడు. ఆమె చేతులకు గాజులు లేవు. అప్పుడతను అయ్యో అనుకున్నాడు. ఆమె మీద అనుకోకుండా సానుభూతి పెరిగింది! అప్పుడతనికి మనిషికుండే సహజ లక్షణాలు గుర్తొచ్చాయి.

ఆకలి, దూప, నిద్ర, ఆ తరువాత మరొక సారి ఆమెవైపు చూశాడు, ఆమె నవ్వింది. అతనూ నవ్వాడు. ఇద్దరి నవ్వులు చెరువులోని నీళ్లలో ప్రతిబింబించాయి. చెరువులోని చేపలు అప్పుడప్పుడు ఆమె ఇంట్లోకి ఎదురెక్కాయి. ఆ వాసన వాడంత పాకింది. ఊరు ఊరే కదా, కొందరు పోనీలే అని ఊరుకున్నారు. మరికొందరు పట్టించుకుని పట్టుకుని కొట్టారు. కొట్టిన కొందరి పేర్లే ఇంతకు ముందు రెండవ పేజీలోకి ఎక్కినయి. కొన్నాళ్లు అతను ఆవూరే రాలేదు. ఆమె వైపే చూడలేదు. తన భార్యను తెచ్చుకుని పక్క ఊళ్లో కాపురం పెట్టుకున్నాడు.

ఊళ్లో ముఖ్యమైన వాళ్ల ఇండ్లకు లీటర్ లీటర్ సార, రెండు రెండు తెల్ల చేపలు చేరినాయి. రెండు రోజులు పండుగ చేసుకున్నారు.

"అవును చెరువు నీరు వొదలంది చేపలెట్టా పడతారు?"

"వదలవలసిందే" అని ఒకరు.

"తప్పదు లేకపోతే నష్టం" అని మరొకరు అన్నారు.

"తూకానికొచ్చిన చేపలను, ఇంకా ఎక్కువ కాలం చెర్లోనే వుంచితే, దిగిపోయి తూకం రావు " అన్నాడు గుమాస్తా. కాంట్రాక్టరు ఊళ్ళోకి రావటం లేదు. చెర్లో గుడ్డి కొంగలాగ గుమస్తా తిరుగుతున్నాడు. కొంగను చూసి కాకులు

గద్దలు వాలినట్లు పరాయివాళ్ళు కిరాయివాళ్ళు సందకాడ దిగుతున్న సందడి.

గ్రామాధికారి తన వాకిట్లో మంచం మీద కూర్చొని ఎండ కాస్తు వున్నాడు.

అందరు చేపల్లాగ కదులుతున్నారు. చెరువులో తాబేలులాగా వాకిట్లో గ్రామాధికారి.

అప్పుడే అక్కడకొచ్చిన పెద్దరైతు -

"రాత్రి రైతులందరు మీదగ్గరికి వస్తమన్నరు" అని చెవి దగ్గర వంగి చెప్పాడు.

"ఎందుకట" గ్రామాధికారి. మనిషి కదలకుండా మాటనొదిలాడు.

"అదే చెరువు పంచాయితి కోసమట" ఈసారి చిన్నగనే అన్నాడు.

"ఇంక పంచాయితి ఏంది, ఈయాల్ల ఆర్.డి. ఓ. గారు వస్తారు" అన్నాడు.

"రాకుంట చూడమంటరు" ఈ మాటను మరీ చిన్నగా అన్నాడు.

అప్పుడే కోళ్ల గూటి తలుపు తెరిచినట్టుంది పిల్లకోడి తన పిల్లలను ఎంటేసుకుని వాకిట్లో తిరుగుతువుంది.

"ఎందుకని" లేచి నిలుచుంటు అడిగాడు.

"నీటిని వదులొచ్చు" అంటున్నారు.

"వాళ్లకేమన్న పిచ్చి పట్టిందా?" కొంచెం కోపాన్ని ప్రదర్శిస్తూ.

"అవులగాండ్లు" అని రైతులను తిడుతు ఇంట్లోకి నడిచాడు.

సరిగ్గా ఓ పదిమంది రైతులు వచ్చి వాళ్ల గ్రామాధికారి ఇంట్లోకి నడిచారు. ఆ ఇల్లు ఎంతో విశాలమైంది. గ్రామాధికారి భూమి బుట్ర వున్న పెద్దరైతే. ఆవూరికి ఏ అధికారి వచ్చినా ఆయన ఇంట్లోనే ఆతిధ్యం. వచ్చిన వాళ్లలో ఎవరు హుశారుగ లేరు. ముఖాలు ముడుచుకుని కొందరు, దుఃఖపూరిత ముఖాలతో మరికొందరు, గ్రామాధికారికి ఏం అర్థం కాలేదు.

"ఏమిటి అందరు ఇలా వున్నారు. ఏంజరిగింది." అని అడిగాడు.

"మూడు నాలుగు రోజులనుండి వాడకట్టు కొకన్ని చితక కొట్టి పోతున్నారు." అని అన్నాడు మెల్లగా.

"ఎవరట" గ్రామాధికారి నివ్వెరపోతూ అడిగాడు.

'తెలవదు' అన్నట్టు చూశారు అందరు.

"మరి ఫిర్యాదు చేయలేదేమి? నేను ఊళ్లో లేక రెండ్రోజులైంది."

"ఫిర్యాదు చేస్తే చంపేస్తాం అని చెప్పి పోతున్నారు" బిక్కు బిక్కుమంటూ చెప్పారు.

"ఎవరబ్బ నక్సల్స్ కాదు కదా?" అంటూ ఏదో ఆలోచనల్లోకి వెళ్లాడు. అయినా "వాళ్లు మనతెరువు ఎందుకు వస్తారు."

అందరు మౌనంగా నిలుచున్నారు.

"ఈరోజు ఆర్డీవో గారొస్తారు. ఆ చెరువు విషయం తేలుతుంది. మీరు కోరినట్టే

నీటిని వదలరు" అన్నాడు. ఇంతకు ముందే తీసుకున్న నిర్ణయాన్ని ప్రకటించాడు.

ఎవరు మాట్లాడలేదు. ఒక రైతు వచ్చి తన చొక్కాను లేపి తనను కొట్టిన దెబ్బలు చూపించాడు. అట్లాగే ఇంకోరైతు కమిలిన తన వీపును చూపించాడు.

గ్రామాధికారి నోటిమీద వేలేసుకుని చూస్తూ-

"ఏందర్ర ఇది ఊరా పాడా? ఎందుకిట్ల జరుగుతుంది? మరి ఇంత జరుగుతుంటే సర్పంచ్ గారు ఏంచేస్తున్నట్టు? చూస్తూ కూర్చున్నాడా" అని అడిగాడు

"ఆయన ఊళ్లో ఉంటే కదా! అంతో ఇంతో అందుకుని పట్నంలోపడుకున్నాలె" అన్నాడు ఓరైతుకూలి.

"మరి ఊరేమైపోవాలని మళ్లీ ఎన్నికలొచ్చినప్పుడు కదా ఆలోచించేది" అన్నారు కండవలో చుట్టి వుంచిన మూటని చేతిలో పట్టుకొని చాటుకు తీసుకెళ్లి అతని దోసిటిలో వుంచుతు-

"ఆర్. డి. ఓ. గారు రాకుండ సూడుర్రి. చెరువు నీటిని వదిలి పెట్టుర్రి అన్నాడు" పెద్దరైతు. డెబ్బదేళ్ళు దాటినా ఎండు కర్జూర పండులాగా గట్టిగానే వున్నాడు.

"గ్రామాధికారి నోరు తెరుస్తూ వీళ్లకు పిచ్చిగాని పట్టిందా"

"పైసలిచ్చి పని చేయమంటున్నారు. మీ అంతల మీరు చేస్తలేరు కదా" అని సలహా ఇచ్చాడు. పైసలవైపే చూస్తు - వాళ్లిష్టం చేసేది ఏముంది అనుకున్నాడు.

గ్రామాధికారి డబ్బులు తీసుకోవడం చూసి రైతులు ఏదో బరువును దించుకున్నట్టు ఊపిరి పీల్చుకున్నట్టు చూశారు.

"సరే వెళ్లండి! నేను డివిజన్ ఆఫీసుకు వెళ్ళొస్తా. లేకపోతే ఆర్. డి. ఓ. గారొస్తారు" అంటూ అందర్నీ వాకిలి వరకు సాగనంపి తాను ఇంట్లోకి నడిచాడు.

ఊరి పరిస్థితి ఇట్లా మారినందుకు విచారిస్తూ. చెరువు ఊరికి ఉపకారం చేస్తుందేమో అనుకుంటే చెరువు చెడేచేసే టట్టు వుంది కదా? అనుకుంటూ వాకిట్లోకి వచ్చి నిల్చున్నాడు. సరిగ్గా అప్పుడే ఓ కోడిపుంజు మరో కోడిపుంజును తరుముతూ వెళ్లింది. అది చూసి మనుషులకు, వీటికి తేడా ఏముంది అనుకుంటూ బస్టాండ్ వైపు నడిచాడు.

ఆవూరికి ఆర్. డి. ఓ. రానే రాలేదు!

నవంబర్ 99 ●